# దక్షిణాఫ్రికా నానీలు



రాపోలు సీతారామరాజు

# దక్షిణాఫ్రికా నానీలు

రాపోలు సీతారామరాజు

అద్విక్ ప్రచురణలు

**Dakshinafrica Naneelu**
by **Rapolu Seeta Rama Raju**

First Published: April, 2019
Copies : 1000

Price: **Rs.50/-**

**For Copies:**
**Rapolu Seeta Rama Raju**
South Africa
Cell: +27 72 774 7549
Email: rsrraju@gmail.com

And
**Leading Book Stores**

**Publihsed by:**
Advik Prachuranalu
Cell: +27 72 774 7549
Email: rsrraju@gmail.com

**Printed by:**
Lepakshi Printers, Hyderabad

అక్షర సంస్కారమిచ్చిన అమ్మానాన్నలకు

అక్షరాన్ని నేర్పిన ఆచార్యులకు

అక్షరాన్ని ప్రేమించడం నేర్పిన సాహితీమూర్తులకి

నా అక్షరానికి అండగా నిలిచే నా సహచరికి

నా అక్షరాన్ని ప్రేమించే తమ్ముడు, చెల్లికి

నా అక్షరాన్ని అభిమానించే ఆత్మీయులకి

నా అక్షరాన్ని చూసి తనూ రాయాలనుకునే అద్విక్‌కి

**Dr. N. Gopi** M.A. (Telugu) Ph.d
Professor of Telugu (Retd.)
Emeritus Fellow,
Former Vice-Chancellor,
PS Telugu University,
Former Dean, Faculty of Arts,
Osmania University, Hyderabad.

(Res.) 040 - 27037585
Cell: 93910 28496
Email:
prof.ngopi@gmail.com

# విదేశంలో ఇండియా గాలి!

అవి 2017 డిసెంబరులో హైదరాబాద్‌లో తెలుగు ప్రపంచ మహాసభలు జరుగుతున్న రోజులు. వాటికి మన తెలంగాణ బిడ్డ రాపోలు సీతారామరాజు దక్షిణాఫ్రికా నుండి తరలి వచ్చాడు. అతడు అక్కడ ఉద్యోగం చేస్తున్నాడు. రాజు నన్ను చూడటానికి వచ్చినపుడు చాలా బిజీగా ఉన్నాను. అతనితో కాస్త సమయం ఎలా గడపాలా అని ఆలోచిస్తున్నాను. డిసెంబర్ 8, 2017 అనుకుంటాను సీతా సుధాకర్ అని పూనాలో పనిచేస్తున్న ఓ ఆఫీసర్ భార్య, మంచి కవయిత్రి. ఆమె తన వచన కవితల పుస్తకావిష్కరణ హైదారాబాద్‌లో పెట్టుకుంది. నేను ఆవిష్కరించాలి. జూబిలీహిల్స్ లోని దసపల్లా హోటల్‌లో సభ. అమె గొప్ప పెయింటర్ కూడా. రాజును నాతో పాటు ఆ సభకు రమ్మన్నాను. రానుపోను ఓ మూడు గంటలు కారులో మాట్లాడుకోవచ్చని. రాజు అలాగే చేశాడు. ఆ మూడు గంటలు మా అనుబంధాన్ని గట్టిగా ముడివేశాయి.

రాజు నెమ్మదస్తుడు, భావుకుడు. పుట్టిన దేశానికి దూరంగా ఉన్నా మన సాహిత్యాన్ని మరువనివాడు. నిజానికి మనకన్నా మన కవిత్వాన్ని ఎక్కువగా ప్రేమిస్తున్నాడనిపించింది. ఎక్కడి దక్షిణాఫ్రికా, ఎక్కడి గాంధీజీ జ్ఞాపకాలు. సాహిత్యం ప్రపంచాన్ని

కలుపుతుందనడానికి రాజు కవిత్వ పిపాస ఓ నిదర్శనం. కవిత్వం లేకపోతే దక్షిణాఫ్రికాలోని అనేక ఉద్యోగుల్లో అతడూ ఒకడైపోయేవాడు. ఇప్పుడలా కాదు కవిత్వంతో దూరాలను జయించాడు. సముద్రాలను ముడివేశాడు. ఇవాళ రాజును తలచుకుంటుంటే న్యూజీలాండ్‌లోని గొల్లపూడి సతీష్ గుర్తొస్తున్నాడు. అతను కూడా అందమైన నానీలు రాసి హైదరాబాద్‌లో ఆవిష్కరించుకున్నాడు. ఇంకా నిరంతరం రాస్తున్నాడు. వీళ్ళిద్దరూ ఇక్కడుంటే బాగా పేరొచ్చేది అని అనుకుంటే సరికాదు. ఉంటే కీర్తిపరుగుల్లో వచన పడిపోయి ఆర్తికి దూరమయ్యేవాళ్ళేమో. చెప్పలేం.

రాజు మా ఇంటికొచ్చినపుడు నావి కొన్ని పుస్తకాలు ఇచ్చాను. వాటిలో నానీలు కూడా ఉన్నాయి. రాజు మస్తిష్కమనే చిప్పలో అవిప్పుడు ముత్యాలైనాయి. అప్పుడప్పుడు వాట్సప్ సంభాషణలు సాగిస్తూనే ఉన్నాడు. ఈ వాట్సప్ ద్వారానే వెన్నెల సత్యం అనే నానీల కవితో స్నేహం ఏర్పడింది. అతని సహకారంతోనే రాజు రాసిన నానీలు డిటిపి రూపంలో నా ముందుకొచ్చాయి. వెన్నెల సత్యం పేరుకే వెన్నెల, ఎండపొడ లాగా వెచ్చగా వ్యాపించే చైతన్య హృదయుడు. రక్త సంబంధాన్ని మించి సాహిత్య సంబంధం గొప్పది అని ఇట్లాంటి సంఘటనల వల్లే నాకనిపిస్తుంది.

నేనీ మధ్య చైనాకు వెళ్ళినపుడు జహరోజ్ (Nthabiseng JahRose Jafta) అనే నల్లజాతి యువతి కూడా దక్షిణాఫ్రికా నుండి వచ్చింది. గొప్ప వాగ్గేయకారిణి. మన గోరటి వెంకన్న లాగా. అక్కడి చైనా సాహిత్య మండలిని ఒక ఊపు ఊపి పారేసిందామె. రాజు

నా దగ్గర అమె నెంబర్ తీసుకొని ఆమెతో మాట్లాడాడు కూడా. అతని కవిత్వ దాహం అలాంటిది.

ఇప్పుడు సీతారామరాజు 150 పైగా నానీల్తో మన ముందుకు వస్తున్నాడు. దీనికి ఓ రెండు మాటలు రాయడానికి నెలలు తీసుకున్నందుకు బాధగా వుంది గానీ నా అనివార్యతను రాజు అర్థం చేసుకున్నాడు. కొన్ని నానీలను పరామర్శిస్తాను.

**ఆఫ్రికా**
**చీకటి ఖండం కాదు**
**ఆది మానవుడు**
**అగ్గి వెలిగించిందిక్కడే!!**

చీకటి ఖండం ఎవరికి? వెలుగులో ఉన్నామనుకొనేవారికి. నిజానికి తొలి వెలుగులు ప్రసరించింది అక్కడి నుంచే అంటున్నాడు రాజు. నేనింతకు ముందే అన్నట్టు రాజు విదేశంలో ఉన్నా కవిత్వ సంవేదనను పోగొట్టుకోలేదు, పైగా అది ద్విగుణీకృతం అయింది. చూడండీ నానీ...

**ఖండాలు దాటాను**
**సంద్రాలు ఈదాను**
**కవిత్వ రుచి**
**ఎక్కడైనా ఒకటే!!**

రాజు రాసిన చాలా నానీల్లో కవిత్వశక్తికి లోటు లేదు. దానికి ఒక ఉదాహరణ.

**వర్షంలో**
**కారు ప్రయాణం**
**భావ కవితలోకి**
**చొచ్చుకుపోతున్నట్లు!!**

దీనివల్ల రాజు మనకు పూర్తిగా అర్థమయినట్లే. ఇవేకాక సామాజికత, దేశీయత, కవితాత్మకత ముప్పేటలుగా అల్లుకుపోయిన పైనం నానీల్లో వుంది. ముఖ్యంగా కవి యొక్క హృదయ సరళత.

పునరుక్తి కాకపోతే నేను మళ్లీ అంటాను. ఇదంతా నానీల నిర్మాణ విశిష్టత. భావాలను ఒదిగించుకొనే అక్షయ పాత్రత. అయితే మంచి నానీ పుట్టాలంటే మాత్రం భావ సాంద్రత తప్పనిసరి. ఇది రాజు కవిత్వంలో పుష్కలంగా వుంది.

నానీలు పుట్టి 20 యేళ్ళు దాటింది (1997). దాదాపు 350 నానీల సంపుటాలు వచ్చాయి. పుస్తక రూపంలో రాకుండా వెయ్యిమంది దాకా ఉంటారు. నానీ తెలుగు వారందరి బాణీ అయింది. వాణి నానీలను ఆశీర్వదించి పులకించింది.

దూరాలను కవిత్వం చెరిపివేస్తుందనడానికి ఈ నానీలు తార్కాణం. నానీలు వెన్నెల సత్యం, సీతారామరాజులను స్నేహితులుగా మార్చేశాయనడానికి కూడా ఇదొక అందమైన దృష్టాంతం.

సీతారామరాజును మనసారా అభినందిస్తూ నానీల ప్రపంచ కుటుంబంలోకి ఆహ్వానిస్తున్నాను.



(డాక్టర్ ఎన్.గోపి)

# మృష్టాన్న భోజనం - రాపోలు నానీలు

- డాక్టర్ తలతోటి పృథ్వీరాజ్

**ఈ** లోకంలో ఒకరితో ఒకరికి స్నేహం వివిధ సందర్భాలు, కారణాలు, కారకులవల్ల ఏర్పడుతుంది. నాకైతే సాహిత్యం ద్వారా రాపోలు సీతారామరాజు గారితో స్నేహబంధం ఏర్పడింది. నేను రూపొందించిన ఆడియో, వీడియో సాహిత్య సీడీలను ఎంతో ఆసక్తితో తను ఉండే దక్షిణాఫ్రికాకు తెప్పించుకుని, ఆస్వాదించి ఖండాంతరాల నుండి తన ప్రతిస్పందనను తెలియజేస్తూ సాహిత్య పలకరింపులు చేస్తూ ఉండేవాడు. కొన్ని రోజుల తర్వాత తాను రాసిన కవిత్వాన్ని వాట్సాప్ ద్వారా పంపించడం ప్రారంభించారు. చదివి బాగోగులు తెలియజేసేవాడ్ని. ఇంకొన్ని రోజుల తర్వాత కొన్ని నానీలను పంపించి చదివి ఎలా ఉన్నాయో చెప్పమన్నాడు. చదవగానే నానీని చెప్పే విధానం పట్టుకున్నాడనిపించింది. నానీలలో అతని భావుకత కూడా బాగుందనిపించింది. ఇలా జరుగుతున్న చాలా రోజుల తర్వాత ఒకచోట కూర్చిన నానీలను ముందుమాట కోరుతూ నాకు పంపించడం జరిగింది.

నాకు అప్పుడప్పుడు అనిపిస్తుంటుంది. ఈ దేశంలో ఉన్నవారికంటే విదేశాల్లో ఉన్న మనవారికే మాతృభాషపై, సాహిత్యంపై, సంస్కృతిపై మమకారం, అభిమానం ఎక్కువ ఉంటుంది. “దూరమైన కొలది పెరుగును అనురాగం” అని ఆత్రేయగారి సిద్ధాంతాన్ని అనుసరించే అలా అనుబంధం, అనురాగం ఏర్పడుతుందనిపిస్తుంది. పుట్టిన దగ్గర నుండి వెలితి అనిపించని వారికి అమ్మో, నాన్నో పోయాక

జీవిత వెలితి కనిపిస్తుంది. విదేశాల్లో ఉండేవారికి ఆ వెలితి విలువ తెలుసుగనుకనే భాషా - సాహిత్య - సంస్కృతుల గొప్పదనాన్ని ఎందరు ఎన్ని చెప్పినా ఇక్కడివాళ్ళంగా మనం పెడచెవిన పెడతాము. నిర్లక్ష్యం వహిస్తుంటాము. ఇలా సాహిత్యపరంగా వివిధ దేశాలలో ఉండే కొందరి తెలుగువారితో నాకు ఇలా పరిచయం ఏర్పడింది.

సీతారామరాజుగారి నానీలలో వస్తువైవిధ్యం ఉంది. ప్రక్రియ ఏదైనా భావుకతకు అక్షరరూపాన్ని ధరింపజేయడం సులువైన పనికాదు. మధనపడాలి. మథించాలి. అప్పుడే కవితామృతం లభిస్తుంది. ఆ అనుభవంతోనే-

**"పాల కడలి**
**చిలికితే అమృతం**
**జీవితాన్ని చిలికితే**
**కవితామృతం"**

అని అంటాడు నానీలో. అంతేకాదు -

**"భావాల దుప్పటి**
**కప్పుకున్నాను**
**కమ్మని పద్యాన్ని**
**కలగన్నాను!"**

అని అనడమే గాక -

**"అనుభూతుల్ని**
**అక్షరీకరించు**
**ఆత్మను అద్దావా**
**అదే కవిత్వం!"**

అని కవిత్వ ఫార్ములాను తేటతెల్లం చేశాడు. కవిత్వం రాసే కవుల ధ్యాస శ్వాస అంతా భావుకతే. అప్పుడే ఎన్నో కవితలు పురుడుపోసుకుంటాయి. కవి మనుషుల్లో మనిషే అయినా సమాజంలో కవి స్థానం ప్రత్యేకం. కనుకనే-

**"రవి కిరణమై**
**వెలుగునిస్తాడు**
**కవి కవనమై**
**దారి చూపుతాడు"**

అని రాయగలిగాడు. సూర్యునిలా చీకట్లు పారదోలి, వెలుగును ప్రసాదిస్తూ సమాజానికి దారిచూపే అనేకమంది కవుల్లో ఓ కవిగా నిలిచాడు.

రాచరిక వ్యవస్థ అయినా ప్రజాస్వామ్య వ్యవస్థ అయినా కవి అక్షరాల నిప్పురవ్వల్ని సృష్టించగలడు. పుస్తకాల నిప్పుకణికల్ని వెలిగించగలడు. విలువల వలువల్ని నేయగలడు. సామాజిక రుగ్మతలపై కలంకత్తిని దుయ్యగలడు. అందుకే -

**"జీవితాన్ని పండించు**
**విలువలతో**
**కాగితాన్ని మండించు**
**కవిత్వంతో"**

అని చెప్పగలిగాడు. ఇలా కవిత్వంపై నానీల కవిత్వాన్ని రాయడమే కాకుండా; ఉపదేశాత్మక, ప్రబోధాత్మక నానీలను కూడా ఎన్నింటినో రచించాడు సీతారామరాజుగారు.

కవిత్వశరీరంలో ఉపదేశం కూడా ఒక అవయవమే. లేదా కవిత్వ వంటకంలో ఉపదేశం కూడా ఒక మసాల దినుసే! ఒక

కవి జీవితసారం ఉపదేశం. ఒక కవి జీవితపాఠం ఉపదేశం. ఇతరులకు మంచి దోవ చూపే చూపుడువేలు ఉపదేశం. అనుభవించినంత జీవిత పరిధిలో గ్రహించిన మంచిని పంచడమే ఏకైక అర్హత! ఉదా:

**" 'తార'ల ఆరాధనలో**
**గడిపేస్తావా?**
**తారాపథం**
**దూసుకెళ్ళేదెప్పుడు?"**

అనే నానీని చదివితే కన్న తల్లిదండ్రులకు ఏ ఒక్కరోజు ఒక రూపాయి సంపాయించి ఖర్చుపెట్టి సంతోషపెట్టనివారు, ఆ తల్లిదండ్రుల దగ్గరే డబ్బులు గుంజుకుని తమ అభిమాన నాయకుడని ఫ్యాన్స్ పేరుతో గజమాలలకు, పాలాభిషేకాలకు, ఫ్లెక్సీలకు వేల రూపాయలు తగలబెట్టే మూర్ఖులైన ఎందరో మనకు తెలుసు. ఎవరి జీవితానికి వారే హీరో అనే విషయం గ్రహించని అమాయక యువత వారి భవిష్యత్తుగూర్చి ఆలోచించాల్సిన అవసరం ఎంతైనా ఉందిని పై నానీ చెప్పకనే చెబుతుంది.

ప్రతి అక్షరం బతుకుదోవచూపే ఒక దివిటీ! అక్షరాల విలువ తెలిసింది గనుకనే నేడు పేదవారు సైతం లక్షలుపోసి చదువు'కొంటు'న్నారు. ఇది మంచి పరిణామమే! మంచీ చెడుల విచక్షణ తెలిపేది బుద్ధి. అక్షరమే మెదడును వెలిగిస్తుంది. కనుకనే

**"దీపముంటే**
**కంటికి వెలుగు**
**పుస్తకముంటే**
**మస్తకమే వెలుగు"** అని అంటాడు.

గెలుపునుండి కంటే ఓటమినుండే అనేక జీవితపాఠాలు మనం నేర్చుకోవచ్చు. గెలుపు అహంకారాన్ని తెచ్చిపెడితే, ఓటమి గెలుపు గొప్పదనాన్ని తెలుసుకునేలా చేసి మనిషిని మనిషిలా నేలపై నిలబెడుతుంది. విజయాన్ని పొందాక అనేక పరాజయాల మాధుర్యాన్ని పంచుతుంది. ఈ వాస్తవాలను గ్రహించిన విజ్ఞులెవ్వరూ జయాపజయాలకు ఉప్పొంగరూ - కృంగిపోరు! కనుకనే -

**"గెలుపు**
**ఆకాశానికెత్తొచ్చునేమో**
**నేలమీద కాళ్ళు**
**నిలిపేది ఓటమే"**

అనే ఉపదేశాత్మక నానీ రాయగలిగాడు కవి.

ఒకో మనిషికి ఒకో ప్రాధాన్యత ఉంటుంది. చచ్చేదాక బతకాలి గనుక అని బతకడముగాక, ఎలా బతుకుతున్నామనేది ముఖ్యం. ఎంత సుఖంగా బతికినా, ఎంతకాలం బతికినా ఎంత కూడబెట్టినా - పెట్టకపోయినా, పోయాకకూడా మనం బతికిన మంచి బ్రతుకే మనల్ని జీవింపచేస్తుంది అనేది ప్రతి ఒక్కరూ గ్రహించాలి. ఈ ఆలోచనల్లోనుండి వచ్చినదే ఈ నానీ-

**"ఎన్నాళ్ళు బతికావన్నది**
**నీ వయస్సు**
**ఎలా బతికావన్నదే**
**నీ యశస్సు"**

ఆరోగ్య ప్రాధాన్యతను ప్రబోధించే నానీలుగా కనిపిస్తున్నా మానవ సంబంధాలలో ముఖ్యమైన మనిషి నడత మనుషుల మధ్య దూరాన్ని తగ్గించి మనసుల్ని దగ్గరజేస్తుందని ఇలా అంటాడు కవి-

**"దూరాన్ని**
**దాటించేది నడక**
**దూరాల్ని**
**చెరిపేసేది నడత"**

ఇప్పుడు ఎవడినుయ్యి వాడిది, ఎవడి గొయ్యి వాడిది. ప్రహరీల చెరల్లో ఖైదీలం. కాని ఇవే అరుగులు ఒకప్పుడు కాలక్షేపపు వేదికలు. ఏ మూల ఏం జరిగిందో తెలియజేసే లోకాభిరామాయణం.

**"ఉదయం పరుగు**
**ఆరోగ్యదాయిని**
**సాయంత్రం అరుగు**
**విజ్ఞాన ఖని!"**

పైన పేర్కొన్న రెండు నానీలు వస్తువు - భావరీత్యానేగాక, నానీ నిర్మాణం రీత్యాకూడా పేర్కొనాలి. "నడక-నడత, పరుగు- అరుగు" పదాలు కృతకంగా పెట్టినవి కాకుండా అలవోకగా వచ్చి అంత్యప్రాసగా అలరించాయని గ్రహించవచ్చు.

నాలుగు పాదాలలో 20 అక్షరాలకు తగ్గకుండా 25 అక్షరాలకు మించకుండా అనే నియమాన్ని ఈ కవి పాటించడమేగాక; మొదటి రెండు పాదాలు ఒక యూనిట్‌గా, మూడు-నాలుగు పాదాలు మరో యూనిట్‌గా నానీని చెప్పే లక్షణాన్ని కవి పట్టుకున్నాడు. కనుకనే ఈ నానీలు అలరించాయి. ఉదా -

**"అమ్మ నీ కడుపు**
**తడుముతుంది**
**మరి నాన్న**
**నీ వెన్ను తడుతాడు!"**

ఈ నానీ తల్లిదండ్రుల ఔన్నత్యాన్ని చాటే అద్భుత భావుకతకు ఉదాహరణగానే గాక; పాద నిర్మాణం దృష్ట్యా ఉదాహరించ తగినదిగా కూడా పేర్కొనవచ్చు.

కవిత్వంలో తాత్త్వికత కూడా ప్రధానమైన అనుభూతే! తాత్త్వికత జీవిత విలువను, జీవిత లోతును, జీవిత మర్మాన్ని, జీవిత సారాన్ని తెలియజేస్తుంది. పాఠకుడ్ని ఆలోచింపజేస్తుంది.

"నాకు తెలిసుంటే సినీ హీరో ఉదయ్‌కిరణ్‌ని ఉరిపోసు కోకుండా రక్షించేవాణ్ని" అని చెప్పిన నటుడు రంగనాథ్‌గారే కొన్ని రోజుల తర్వాత ఉరిబోసుకుని చనిపోయారు. జీవించడం కూడా ఒక సాహసమే. జీవించడమూ ఒక కళే! నటించడం వృత్తే అయినా జీవితంలో నటించడం కుదరదు అని తెలుసుకోవాలి. అలా అని చావే శరణ్యం అనిగాక సవాళ్లను ఎదుర్కుంటూ బ్రతకటమే జీవితమని గ్రహించాలి. సమస్యలను ఓడించి గెలవాలి. ఈ పరమార్థంలోనుండి -

**"తెరపై అతనో**
**మహా నటుడు**
**జీవితంలో నటించలేక**
**ఓడిపోయాడు"** అని అంటాడు కవి.

ఈ క్రింది నానీ ప్రాకృతికంగానే గాక, తాత్త్వికంగా కూడా ప్రస్తావించదగినది.

**"ఆకులు రాలిపోతే**
**ఆవేదననేల**
**పచ్చని చీరలో**
**రాదా ఆమని హేల!"**

కష్టాలు, నష్టాలు శిశిరమైతే, సుఖసంతోషాలు వసంతం. ఏ కాలం కలకాలం నిలువదు. అన్నీ పునరావృతం అవుతుంటాయి. మనిషి జీవితంలో సుఖదు:ఖాలు కూడా అంతే.

నాకూ అప్పుడప్పుడు అనిపిస్తుంటుంది. చేతుల్లో ఉండగా కొన్నింటి విలువ గ్రహించం. నిర్లక్ష్యం చేస్తాం. చేజారిపోయేటప్పుడు దు:ఖించడం తప్ప చేసేదేమి ఉండదు. ప్రమాదంరీత్యా గాని, అనారోగ్యరీత్యా గాని, క్షణికావేశంతో చేసుకున్న ఆత్మహత్య ప్రయత్నంలోగాని ప్రాణంపోయే స్థితిలో కొట్టుమిట్టాడుతున్న క్షణాన ఆ వ్యక్తి బ్రతుకు ఆరాటం అంతా ఇంతా కాదు.

పరామర్శకు అందరం ఏదో ఓ రోజు ఆసుపత్రికి వెళ్ళినవారమే! ఆ అనుభూతినుండి పుట్టినదే ఈ క్రింది నానీ.

**"ఆసుపత్రిలో**
**మిత్రుణ్ణి పరామర్శించా**
**బతుకు ఆరాటం**
**అర్థం తెలిసింది!"**

రాజకీయ అంశాలపై కవిత్వం రాయని కవి ఉండడంటే అతిశయోక్తి కాదు. ఈ దేశంలో అనేక అంశాలకు కేంద్రబిందువులా ఉన్నది రాజకీయం. ప్రతిదానిలో రాజకీయ జోక్యం - ప్రమేయం ఉంది. పాలితులైన ప్రజల అభిమానాలు, అభిప్రాయాలు పార్టీలు - నాయకులపట్ల ఎన్నిరకాలుగా ఉన్నా ఆయా పార్టీలలో కనిపించే సారూపత్య ఒక్కటే! ఏం చెప్పి, నమ్మించి ఓట్లు కొల్లగొట్టాలనేదే! అందుచేతనే -

**"జెండాలు వేరు**
**ఎజెండాలొకటే**

**ప్రజల ఓట్లను**

**కొల్లగొట్టే పనిలో..!"**

అని రాజకీయ నాయకుల ఓట్ల దోపిడీని...

**"ప్రజల మేలుకు**

**సుపరిపాలన**

**పాలకుల బాగుకైతే**

**స్వార్థ పాలన"**

అని రాజకీయ నాయకుల స్వార్థ పాలనను నానీలద్వారా విమర్శించారు కవి సీతారామరాజు.

రాజకీయాంశాలనేగాక భక్తికి, బ్రతికే బ్రతుక్కి పొంతనలేని తీరుని ఉద్దేశించి -

**"నవగ్రహ పూజలు**

**చేస్తాడు**

**విడ్డూరంగా**

**భూగ్రహం కబ్జా చేస్తాడు"**

అని కబ్జాకోరుల తీరును దుయ్యబట్టాడు కవి. అంతేకాదు -

**"పాపాలు పోతాయని**

**గంగలో మునిగా!**

**పైకి లేస్తే**

**మాలిన్యం నా ఒళ్లంతా!!'**

అని పుష్కరం-పుణ్యం పేరుతో అర్థరహితంగా మనిషి ఆచరించే వాటిని సున్నితంగా విమర్శించారు.

ప్రపంచం కుగ్రామమయ్యాక కనుమరుగయిన సంప్రదాయిక వస్తువులు, పద్ధతులు అన్నీ ఇన్నీ కాదు. కుంకుళ్ళతో తలస్నానం చేసే రోజులు పోయి షాంపులతో తలస్నానం చేయడం సర్వసాధారణమైన విషయంగా మారిపోయింది. అందుకనే -

**"కుంకుడు రసం**
**మింగిన మార్కెట్ భూతం**
**షాంపూను**
**విసర్జించింది"**

అని అంటాడు. మంచిరూపం వికృతరూపాన్ని ధరించడమే విసర్జించడం. విసర్జించడం అనే పద ప్రయోగం బాగుంది.

**"డాలర్‌కు**
**విశ్వవిపణి దండం**
**రూపాయిది**
**దినదిన గండం"**

అని నిలకడలేని రూపాయి విలువకు, భారతదేశ ఆర్థిక దుస్థితికి కవి కలవరపడ్డాడు.

**"ఆలస్యంతో**
**అమృతం విషమే!**
**మరి కాలుష్యంతో**
**బతుకులు విషమమే!!"**

అని కాలుష్యమనే కోరలతో కాటేసి ప్రాణాలను బలిగొనే నేటి దారుణ వాతావరణ స్థితిపై 'ఆలస్యం అమృతం విషం' అనే నానుడితో నానీని చెప్పిన విధానం బాగుంది.

సీతారామరాజు నానీల సంపుటి మృష్టాన్న భోజనాన్ని వడ్డించిన విస్తరి. వివిధ రుచులతో వండి వడ్డించిన పదార్థాలలా వివిధ కవితా వస్తువులతో కవిత్వీకరించి మనకు పంచిన నానీలు ఎన్నో ఉన్నాయి. అనుభూతిలోతుల్లో నుంచి రూపుదాల్చుకున్న నానీలు ఇవి. నానీల లక్షణాలను లక్షణంగా అనుసరించి రాసిన కవితా సంపుటి. అంత్యప్రాసలతో పరవళ్లుదొక్కిన నానీలు. వెరసి నీ, నా భావాలను తట్టిలేపి ఆలోచింపజేసి అనుభూతిచెందించిన నానీలు ఇవి.

కవి రాపోలు సీతారామరాజుకి అభినందనలు. సాహిత్య సృజనలో మరింత పరిణతి సాధించాలని, మరిన్ని రచనలు వీరి కలంనుండి రావాలని ఆకాంక్షిస్తున్నాను.

అనకాపల్లి
8 ఫిబ్రవరి, 2019

(డాక్టర్ తలతోటి పృథ్విరాజ్)

# వజ్రాల నానీలు!

**- వెన్నెల సత్యం**

ఈ మధ్య కొంతమంది సీనియర్ కవులను కలిసినప్పుడు నానీలను ఒక చిన్న ప్రక్రియ అనే అభిప్రాయంతో వారు ఉన్నారనిపించింది. అయితే నేనీ అభిప్రాయంతో పూర్తిగా ఏకీభవించను. పాతిక అక్షరాలు, నాలుగు పాదాల్లో అద్భుతంగా పండే నానీ వచన కవితకు దీటుగా నిలబడడం గొప్ప విషయమే. పాల్కురికి సోమనగారన్నట్లు అల్పాక్షరాల్లో అనల్పార్థ రచనగా ఈ ప్రక్రియను నిస్సందేహంగా చెప్పవచ్చు. 350కి పైగా వచ్చిన నానీల సంపుటాలను పరిశీలిస్తే మనకు ఈ విషయం ప్రస్ఫుటమవుతుంది. లఘు కవితా రూపాల్లో అత్యంత ఆదరణ పొందడమే కాకుండా రెండు దశాబ్దాల తర్వాత కూడా మరింత వన్నెలీనుతూ ఉండటం దీని ప్రత్యేకత. నానీల ప్రక్రియ మొదలయ్యాక ఎంతోమంది ఉద్దండులైన కవులు సైతం నానీలను రాయడంతో ఈ ప్రక్రియకు ఉన్న విశిష్టత కనిపిస్తుంది.

మన తెలంగాణలో పుట్టి దక్షిణాఫ్రికాలో ఉద్యోగరీత్యా నివాసముంటున్న రాపోలు సీతారామరాజుకు సాహిత్య అధ్యయనం నిత్యకృత్యం. ఈనాటి యువకుల్లో కనిపించని భాషా మమకారం, సాహిత్యాభిరుచి ఇతనిలో మెండుగా కనిపిస్తాయి. అత్యంత బిజీగా ఉంటున్నప్పటికీ మంచి సాహిత్యం సృష్టించేవారితో సాన్నిహిత్యాన్ని పెంచుకుంటూ కవిత్వానికి తనకూ ఉన్న బంధాన్ని పరిపుష్టం చేసుకుంటున్న సీతారామరాజులో మంచి కవి ఉన్నాడని ఈ నానీలను చూస్తే అర్థమవుతుంది.

అన్నం ఉడికిందో లేదో చూడాలంటే ఒక మెతుకు చూసినట్టే ఈ నానీలు ఎంత రసవంతమో, చమత్కార సహితమో కొన్నింటిని చూస్తే చాలు.

ఇన్నేళ్ల తన అధ్యయనానికి మచ్చుతునకగా కొన్ని నానీలను ఇలా పలికిస్తున్నారు. **"కవిత్వమంటే/ కమ్మని వాక్యాలేనా/ కరుణ ఉంటే/ రసాత్మక కావ్యాలు"** అంటూ కవిత్వానికి కాస్త పరిమళం అద్దమంటున్నాడు.

మరో నానీలో **"భావాల దుప్పటి/ కప్పుకున్నాను/ కమ్మని పద్యాన్ని/ కలగన్నాను"** అని కమ్మని కవితకు భావానికి సయోధ్య కుదిర్చాడు మరి.

పవిత్ర గంగానది ప్రస్తుత దుస్థితినీ, మనిషి పర్యావరణాన్ని పరిహసిస్తున్న పరిస్థితినీ ఈ నానీలో ఎలా కళ్లకు కట్టాడో చూడండి - **"పాపాలు పోతాయని/గంగలో మునిగా/ పైకి లేస్తే / మాలిన్యం నా ఒళ్ళంతా"** పాపం! గంగమ్మ అనిపించక మానదు.

ఈ భూగోళంలో మూడొంతుల నీరు ఉన్నా మనిషి దురాశ పతనానికి ఎలా దారితీస్తుందో చూపారు ఇందులో... **"భూగోళంలో/ మూడొంతులు నీరే/ నిర్లక్ష్యం చేశామా/ మిగిలిస్తుంది కన్నీరే"** మనిషిని ఇప్పటికైనా కళ్లు తెరవమంటున్నాడు.

ఆధునిక ఆహారపు అలవాట్లను హాస్యంగా ఎలా మలిచాడో ఈ నానీలో.. **"పొట్టనిండా నీళ్లతో/ పానీపూరీ/ పొట్టలోకి వెళ్ళాక/ గప్ చిప్"** బాగుంది కదూ!

**"ఊహల్లో మా ఊరు/ పచ్చగానే/ వాస్తవంలో అదిప్పుడు/ ప్లాస్టిక్ పల్లె"** పర్యావరణం పాడవుతున్న తీరును ఈ నాలుగు పాదాల్లో నర్మగర్భంగా చెబుతున్నాడు.

చేనేత వెతల పాంచజన్యాన్ని పాతిక అక్షరాల్లో పూరించాడు. **"రంగుల బట్టలు/రమ్యంగా నేస్తాడు/ బతుకు మాత్రం/ రంగు వెలిసిన జెండా"** తన మూలాలను వెతుక్కున్నాడేమో అనిపిస్తుంది. భావ చిత్రానికి ప్రతీకలా నిలిచే మరో నానీ చూడండి **"కాగితంపై వాలిన/ సీతాకోక చిలక/ రంగులద్దని/సహజ చిత్రం"** ఎంత సహజంగా అమరిందో.

తాను పుట్టిన నేల మీద ఓ నానీతో మమకారం ఇలా ప్రకటిస్తున్నాడు రాజు. **"నాటి తెలంగాణ / కోటి రతనాల వీణ / నేడు నాలుగు కోట్ల / రాగాల జాణ"** అంతేనా తాను నివసిస్తున్న నేల మీదా అభిమానాన్ని చూపుతున్నాడిలా. **"వజ్రాలు దొరికే/ నేల ఇది/ ఓ నల్ల వజ్రమూ పుట్టింది/ పేరు మండేలా".**

ఇలా చెప్పుకుంటూ పోతే ముందే చెప్పినట్లు అన్నం ఉడికిందో లేదో మొత్తం పిసికి చూసినట్లు అవుతుంది. అందుకే ఆ రుచిలోని మాధుర్యాన్ని ఆస్వాదించమని రసహృదయాలకే వదిలేస్తున్నాను.

మా ఇద్దరికీ ముఖ పరిచయం లేకపోయినా "గోదావరి కలిపింది ఇద్దరినీ" అన్నట్లు "కవిత్వమే కలిపింది మా ఇద్దరినీ". ముఖ్యంగా నానీలే మా అనుబంధానికి వారధి నిర్మించాయి. నాలుగు మాటలు రాయడానికి అవకాశం ఇచ్చి తన సహృదయతను ప్రకటించుకున్న రాపోలు సీతారామరాజు గారికి ధన్యవాదాలు. వజ్రాల్లాంటి నానీలతో మన ముందుకు వస్తున్న రాజు గారు తెలుగు కవిత్వాన్ని తన అధ్యయనశీలతతో సుసంపన్నం చేయాలని ఆకాంక్షిస్తూ... అభినందనలు!

# త్రిమూర్తులు

సాహిత్యాధ్యయనం నాకు గత కొన్నేళ్ళుగా నిత్యకృత్యమయ్యింది. ప్రవాసంలో ఉన్నా ఎందరో సాహితీమూర్తులను పరిచయం చేసుకోవడం, వారితో మాట్లాడడం ఆనందాన్ని కలిగించే విషయమైపోయింది. ఆలోచనామృతమైన సాహిత్యాన్ని చదివేప్పుడు కలిగే భావస్పందనలకు నాదైన అక్షరరూపాన్ని కలిగించడమూ పరిపాటయ్యింది. అయితే దానికి 'కవిత్వం' అన్న పేరు పట్టడానికి చాలా ఏళ్ళుగా జంకుతూనే ఉన్నాను.

తెలుగు ప్రపంచ మహాసభల కోసమని హైదరాబాద్‌కి వచ్చిన నేను డా. గోపి గారిని కలుసుకున్నాను. వారితో గడిపిన కొన్ని గంటలు, వారిచ్చిన స్ఫూర్తి నేనూ కవిత్వం రాయగలనన్న ధైర్యాన్నిచ్చింది. అలా ఐతే నానీలతోనే మొదలుపెడదామనుకుని ఒకటి రెండు రాసి గోపి గారికి పంపాను. బాగున్నాయన్నారు. నానీల నాన్నే పచ్చజెండా ఊపారు. అలా మొదలుపెట్టి ఇలా పుస్తకంగా వస్తున్నాను.

కవి, విమర్శకుడు, సాహితీ సేవకుడు డా. తలతోటి పృథ్వీరాజ్ గారి కవిత్వ సీడీలను చూసి కొన్నేళ్ళ క్రితమే నానీలు రాయాలనే కోరిక నాలో కలిగింది. ఆ కోరిక అలానే ఉండిపోయింది. కాని గోపి గారిని కలిసాక ఆ కోరిక మళ్ళీ చిగురించింది. అదే సమయంలో ఏదో పత్రికలో 'వెన్నెల' సత్యంగారి కవిత్వాన్ని చదవటం, వారిని పరిచయం చేసుకోవడం జరిగింది. వారి మార్గదర్శనంలో నానీల సృజనను మొదలుపెట్టాను. ఇన్ని నానీలు రాయటానికి సత్యంగా 'సత్యమే' కారణమని చెప్పాలి. ఇలా ఈ

కవిత్వ సంపుటిలా నేను మీ ముందుకు రావటానికి పరోక్షంగా ఎన్ని కారణాలున్నా ప్రత్యక్ష కారకులు ఈ త్రిమూర్తులే. అందుకే ముందుమాటల రూపంలో వారి ఆశీర్వాక్షరాలని ఇందులో పదిలపరుచుకున్నాను. వారికి నా ధన్యవాదాలు

నా ప్రతి అడుగులోనూ వెన్నంటి, నా ప్రతి అక్షరానికి తొలి శ్రోతగా, విమర్శకురాలిగా నిలిచే నా శ్రీమతికి నా రచనలో అర్ధభాగం చెందినట్టే.

నా నుండి ఒక పుస్తకం వస్తుందన్న ఊహతోనే మురిసిపోయిన అమ్మ, నాన్న, తమ్ముడు, చెల్లి కి ఇంకో సగభాగం.

నేను రోజూ ఏదో రాస్తుండడం చూసి తనూ రాయడం మొదలుపెట్టిన నా కొడుకుని చూస్తే నా ఈ పుస్తక ప్రయోజనం నెరవేరినట్లే అనిపిస్తుంది. వాడికోసం ఇంకొకటి రాయాల్సిందే.

పుస్తకానికి అందమైన ముఖచిత్రానిచ్చిన మిత్రుడు రాజన్‌కి ధన్యవాదాలు. పుస్తకానికి ఆకృతినిచ్చిన జయప్రకాష్ గారికి, అందంగా ముద్రించిన లేపాక్షి ప్రింటర్స్ సిబ్బందికి ధన్యవాదాలు.

– రాపోలు సీతారామరాజు

# దక్షిణాఫ్రికా నానీలు

ఆఫ్రికా
చీకటి ఖండం కాదు
ఆదిమానవుడు
అగ్గి వెలిగించిందిక్కడే!!

పిల్లలు మాటలు
నేర్వడమంటే
మన మాటలు మనకే
అప్పజెప్పటం

మల్లె మందారాలేనా
పూలంటే!
సున్నిత సుమధుర
భావమూ సుమమే!

మంచు కరిగితే
నీరవుతుంది
మనసు కరిగిందా
మనిషి నీరు నీరు



అనుభూతుల
మబ్బు కమ్మింది
అక్షరాల
వర్షమే తరువాయి!!

ఖండాలు దాటాను
సంద్రాలు ఈదాను
కవిత్వం రుచి
ఎక్కడైనా ఒకటే!

కదిలే కారులో
సంగీతం
రసరమ్య ప్రయాణానికి
అది సంకేతం!!

వ్యోమగామి
గ్రహాలను చేరాడు
అతని మనసు మాత్రం
ఇంటిమీదే!

వజ్రాలు దొరికే
నేల ఇది
ఓ నల్ల వజ్రమూ పుట్టింది
పేరు 'మండేలా'!

నాటి తెలంగాణ
కోటి రత్నాల వీణ
నేడు నాల్గు కోట్ల
రాగాల జాణ!



విహంగమై
ఎగిరే మనిషి
పక్షిని మాత్రం
పంజరంలో పెడతాడు!

వర్షంలో
కారు ప్రయాణం!
భావ కవితలోకి
చొచ్చుకుపోతున్నట్లు!!

అమ్మ చాటలో
బియ్యం చెరుగుతుంది
రైతు పాదాల
చప్పుడు విన్నట్టుంది!

తప్పెందుకు చేశావు?
తండ్రి ప్రశ్న
మీ బాటలోనే నడిచా
కొడుకు జవాబు!

ఎన్నాళ్ళు బతికావన్నది
నీ వయస్సు
ఎలా బతికావన్నదే
నీ యశస్సు!

మనసొక
కల్లోల సింధువు
మరి కన్నీరు
ఉపశమన బిందువు!!



అమ్మ నీ కడుపు
తడుముతుంది
మరి నాన్న
నీ వెన్ను తడుతాడు!

జీవితమొక
కష్టాల కడలి
నమ్మకం
దరికి చేర్చే జాబిలి

అలుపులేని
పోరాటమంటే?
ఎగిసిపడే
అలనడుగు!

నానీలంటే...
గాఢానుభూతికి
సాంద్రతర అభివ్యక్తికి
చిరునామా!

కవిత్వమంటే
కమ్మని వాక్యాలేనా
కరుణ వుంటే
రసాత్మక కావ్యాలు

మంచిని పలికించేదే
మతం
సమతను పంచడమే
శాస్త్రం అభిమతం



సమూహం
ఒక అధ్యయనం
మరి ఏకాంతం
పునర్మూల్యాంకనం

భావాల దుప్పటి
కప్పుకున్నాను
కమ్మని పద్యాన్ని
కలగన్నాను!

అద్దం చూపేది
ప్రతిరూపం
అంతరంగం చూపేది
అసలురూపం!

కాంతా కనకాల
వెంట పరిగెత్తాడా?
వాడే 'మని' 'షి'
అనబడే మగాడు!

జీవితాన్ని పండించు
విలువలతో
కాగితాన్ని మండించు
కవిత్వంతో!

మనోఫలకంపై
పల్లవులెన్నో
ప్రజలకు చేరాకే
ఝుల్లుమనే పాట!



పదేళ్ళుగా నేను
ప్రవాసంలో...
అవసరం మేరకే
ఆంగ్లంతో సావాసం!

పర్వతాన్ని
అధిరోహించాడు
జీవితమేంటో
తెలిసిపోయింది!

చదివించేదంతా
కవిత్వమవ్వదు
తాదాత్మ్యం
దాని పరమ లక్షణం!

కాలం చేసి
వెళ్ళిపోయావనుకున్నా!
కలల్లో
కాపురమున్నావుగా!!

అతడు
అక్షర తపస్వి!
అందుకేనేమో
కవిత్వం వరమైంది!!

ఆంగ్లమతనికి
బతుకు తెరువు
తెలుగు భాష
జీవన లిపి!!



రైతన్నా! పంట
బాగా పండించావు!!
నీ బతుకు పంట
మాత్రం ఎండిందా?

పాపాలు పోతాయని
గంగలో మునిగా!
పైకి లేస్తే
మాలిన్యం నా ఒళ్లంతా!!

ఆకులు రాలిపోతే
ఆవేదనేల!
పచ్చని చీరలో
రాదా ఆమని హేల!

అర్ధరాత్రి
ఉలిక్కిపడి లేచాను!
నా పక్కనే
పలకరిస్తూ ఓ పద్యం!!

వ్యక్తుల్లో
వర్ణ భేదం చూశాడా?
వ్యక్తిత్వంలో
వాడు ఊసరవెల్లే!!

ఆకాశమంత
ఆలోచనలు నాలో
బంధించేసా
చిన్ని కవితలో..!



డాలర్‌కు
విశ్వ విపణి దండం
రూపాయిది
దిన దిన గండం!

వెన్నెల్లో ఆకాశం
అందమైన ముంగిలి
ఆ నక్షత్రాలే
ముగ్గుల చుక్కలు!

ఆమె జీవితమంతా
కన్నీటిమయం
కదిలే కలమూ
కన్నీరు కారుస్తోంది!

రవి కిరణమై
వెలుగునిస్తాడు
కవి కవనమై
దారి చూపుతాడు!!

మణులకై
మనిషి తవ్వకాలు
దొరికినవి
నాగరికత ఆనవాలు!

ఊహల్లో మా ఊరు
పచ్చగానే!
వాస్తవంలో
అదిప్పుడు ప్లాస్టిక్ పల్లె!



సస్యాన్నిచ్చే భూమిని
నిర్లక్ష్యం చేయకు
స్తన్యమిచ్చే
తల్లి రొమ్ము గుద్దకు!

సకల శాస్త్ర
పారంగతుడతడు
ప్చ్...సమాజాన్ని
చదవడం మరిచాడు!

తెరపై అతనో
మహానటుడు
జీవితంలో నటించలేక
ఓడిపోయాడు!

'లావొక్కింతయు లేదు...'
గజేంద్రమోక్షం!
పోతన తెరిచిన
సాహితీ గవాక్షం!!

నీవెంతటి
జగజ్జేతవైనా
ఆట ఆదినుండి
మొదలెట్టాల్సిందే!!

జీవన గతి
ప్రాణవాయువే
గాలి గతి తప్పిందా?
విగత జీవులమే!



ఆకాశం
ఆద్యంతాలు లేనిది
మనిషి
ఆలోచనలకు మల్లేనే!

కాలాకే ఆకు
పట్టుకున్నట్టు...
ప్రళయమొచ్చాకే
ప్రకృతి పాఠం వల్లెవేయడం!

మనిషి మనుగడ
నిప్పుతో మొదలు
తుదకు వీడ్కోలు
పలికేదీ నిప్పే!

ఉరుకుల పరుగుల
ట్రాఫిక్ జీవితం
ధ్యానంతో
రెడ్ సిగ్నలెయ్యి!!

ముంచే కోరికలు
మూర్ఖుణ్ణి చేస్తాయి
మూడే ప్రశ్నలు
బుద్ధుణ్ణి చేస్తాయి!!

పాఠం చెప్పేది
పిల్లలకయితే
నన్ను నేనే
చదువుకున్నట్టుంది!!



మట్టి దున్నితే
సస్య కేదారాలు
మది తవ్వితే
సాహితీ మకరందాలు!

ఆస్పత్రిలో
మిత్రుణ్ణి పరామర్శించా
బతుకు ఆరాటం
అర్థం తెలిసింది!!

ఖురాన్ గీత
రెండు కళ్ళన్నాడు!
కాని చూపొక్కటే
మానవత్వమన్నాడు!!

దేశరక్షణ
ఓ మహాయాగం!
హవిస్సే...
సైనికుడి రుధిరం!

వరదను చూసి
కన్నీటి వరద పారిందా?
గుండె నది
ఉప్పొంగినట్టే!

సినారె కవిత్వం
చవి చూసాను
మది నిండా
పగలే వెన్నెల



నూరేళ్ళ జీవితం
ఎనిమిదక్షరాల్లో
చెరపకురా చెడేవు!
నిజమేగా!

ఏది నిజం?
భేతాళుడి ప్రశ్న
నిన్ను నీకు తెలిపేదే
విక్రమార్క జవాబు!

కుంకుడు రసం
మింగిన మార్కెట్ భూతం
షాంపూను
విసర్జించింది

చంద్రుడికి క్షయరోగం
ఇంద్రుడిది సం'భోగం'
మరి మనిషికి
మాయరోగం

యవ్వనంలో
చూపుల్తోనే మందలింపు
వృద్ధాప్యంలో
ఆ చూపే మందగింపు!

తల్లి భారతి సిగలో
ఇంద్రధనుస్సు
సప్తవర్ణాలే
ఈశాన్య రాష్ట్రాలు



కాళోజి  కలంలో
కన్నీటి భాష
మరి గళంలో
పలుకుబడుల భాష!

ఆకలి తీర్చిన
అన్నం వండే నిప్పు
ఆదమరిస్తే
అడవులకూ ముప్పు!

తాను కరిగి
కనుమరుగయ్యే
కొవ్వొత్తికి
త్యాగమే చిరునామా!

నీ నీడది
నలుపు రంగే
నీ వ్యక్తిత్వానికి
మాత్రం రుద్దకు!

మరదలిపై మరులు
బావ ఉద్వేగం
మనసులో వెతలు
భావోద్వేగం

కాన్వాసుపై రంగుల
పుక్కిలింత
ఆలోచనకందని
ఆబ్స్ట్రాక్ట్ పెయింటింగ్



రాళ్ళను చీల్చుకు
ఎదిగిన చెట్టు
రాతి మనిషి చేతిలో
నేలకొరిగె!

కాగితంపై వాలిన
సీతాకోకచిలక
రంగులద్దని
సహజ చిత్రం!

అక్షరాక్షరాన
అనుభూతుల్ని
పోతపోస్తాడు
అతడే మన పోతన!

'తార'ల ఆరాధనలో
గడిపేస్తావా?
తారాపథం
దూసుకెళ్ళేదెప్పుడు?

ప్రపంచమే నాదంటే
వాడు నియంత
ప్రపంచం నావాడంటే
అతడు ప్రవక్త

ఆలస్యంతో
అమృతం విషమే!
మరి కాలుష్యంతో
బతుకులు విషమమే!!



దీపముంటే
కంటికి వెలుగు
పుస్తకముంటే
మస్తకమే వెలుగు!!

నులివెచ్చగా
స్పృశించాడు రవి
మొక్కలు
పచ్చగా నవ్వాయి

మాటలు
ఆటుపోట్ల అర్ణవమైతే
మౌనం
నిలకడైన నీటిచెలమ!

పాలకడలి
చిలికితే అమృతం
జీవితాన్ని చిలికితే
కవితామృతం

కనసొంపైన
అక్షరసిరి
వినసొంపైన
వాక్ ఝురి... తెలుగు

ఉత్తర అమెరికా
ఉత్తర కొరియా
ఉత్తుత్తి చర్చలా?
శాంతికి బాటలా?



నిరాశా నిస్పృహలు
నిన్ను ముంచుతాయి
ఆశ ఆశయం
ఎవరెస్టునెక్కిస్తాయి

పదాలు వాక్యాలూ
పట్టు తప్పనీయకు
భావం
దారి మళ్ళుతుంది!

చలిపులి
పంజా విసిరింది
ప్రజలు
ఇళ్ళల్లోకి పరార్!

కొమ్మలకు విరులు
విరబోసుకున్న తరులు
మనిషి
కనులనిండా సిరులు

పిల్లల భవితను
దిద్దేవాడే గురువు
లేదంటే
సమాజానికి బరువు

ప్రతీ పదమూ
రసభరితమూ
సందేహం లేదు
అది పద్మమే!



అర్ధరాత్రి అంతరంగంలో
ప్రసవవేదన
పొద్దున్నే కవి
ఉదయించాడు

ఉదయం పరుగు
ఆరోగ్యదాయిని
సాయంత్రం అరుగు
విజ్ఞాన ఖని!

కండక్టర్
ఉపాధ్యాయుడయ్యాడు
బడికి రోజూ
బస్సులోనే వెళ్తున్నాడు

ఆయన కలం పేరే
వెన్నెల
రాసేదేమో
దివారాత్రాల సంవేదన

పైపైనే
అలల ఆటుపోట్లు
లోపలంతా
నిశ్చల సమాధే!

దూరాన్ని
దాటించేది నడక
దూరాల్ని
చెరిపేసేది నడత



శిఖరపు కొసను
చేరుకోవడమంటే
తనని తాను
తెలుసుకోవడమే

కవి కులంలో
పుట్టాడేమో
అతని అక్షరాక్షరం
కవిత్వమే

గొంగళి పురుగు
సీతాకోక చిలక
అభివృద్ధి గొంగళి
అక్కడే మరి

పొట్టనిండా నీళ్ళతో
పానీపూరి!
పొట్టలోకి వెళ్ళాక
గప్ చుప్!!

స్వాతంత్ర్యం ఎందరో
మహనీయుల త్యాగఫలం
దాన్ని
కుళ్ళిపోనివ్వకు నేస్తం!

దశ దిశలుగా
సాగే ఆలోచనలకి
దిశానిర్దేశం
చేసేది కాగితం



ప్రజల మేలుకు
సుపరిపాలన
పాలకుల బాగుకైతే
స్వార్థ పాలన

మహాకవి చేతిలో
జలగీతానివి
మరి నా చేతిలో
చిన్న నానీవి

భూగోళంలో
మూడొంతుల నీరే
నిర్లక్ష్యం చేశావా
మిగిలిస్తుంది కన్నీరే

పొగమంచులో
కారు ప్రయాణం
స్పష్టాస్పష్ట దారిలో
భావుకత వెతుకుతూ...

ఓ చేత హలం
మరో చేత కలం
సాహితీక్షేత్రంలో
సవ్యసాచి పోతన

పోతన హలం
స్వాభిమాన ప్రతీక
మరి కలం
తెలుగు సాహితీ పతాక!



అనుభూతుల్ని
అక్షరీకరించు
ఆత్మను అద్దావా
అదే కవిత్వం!

నదులకు
కన్నీటి వరద
చెట్లను తెగ నరికిన
పాపమే ఇది!

నవగ్రహ పూజలు
చేస్తాడు
విడ్డూరంగా
భూగ్రహం కబ్జా చేస్తాడు

లేనోడిదేమో
కడుపుమంట
మరి ఉన్నోడిది
కళ్ళమంట

నీ నోటికి మెతుకే
జై కిసాన్!
నీ కంటికి కునుకే
జై జవాన్!

మనిషి వికాసానికి
నాంది నిప్పే
విజ్ఞత లేకుంటే
వినాశిని కూడా



భావకవితా?
అభ్యుదయ కవితా?
సంశయమేల
కవిత్వముంటే చాలు!

గమ్యానికి దార్లు రెండు
మంచీ చెడూ
మరి నీ దారేదో
ఎంచుకున్నావా?

మనస్సే ఒక
సరోవరం!
అంతులేని ప్రయాణమేల?
ప్రయాసలేల?

కవితావేశంలో
అక్షరాలా అన్నయ్యే
నన్ను నానీలకు
తమ్ముణ్ని చేశాడు!

పద్యం పల్లకిలో
ఊరేగాలంట!
గత జన్మలో
శ్రీనాథుడి బోయీనేమో!!

కినిగె...
రష్యా భాషలో పుస్తకం!
తెలుగులో
అరచేతి పుస్తకాలయం!!



వరదల్లో
వణికిన దైన్యభూమి
చేయూతతో
నిలబడాలి దేవభూమి!

ఆటలో ప్రపంచాన్ని
గెలిచాడు
ఇప్పుడు
జనహృదయాలు కూడా!

గుళ్ళుగోపురాలు
తిరిగితే చాలా?
గుండెను చీల్చుకొనే
భక్తి ఉందా?

తాజా పళ్ళంటే
అందరికీ ప్రియమే
కొనాలని వెళ్తే
అందనంత ప్రియం!

సమాచార వాహినిలో
మునిగింది
ఈ తరం
పైకి తేలేదెపుడో!

వాహనాలది
వాయువేగమైనా
దూసుకెళ్ళే
పెట్రో ధరల వెనకనే!



దూరమెంతైనా
కాళ్ళదే భారం
కారొచ్చాక కాళ్ళు
కదలనంటున్నాయి!

'అల్లసాని' వారేమో
వెండితెర మీద
ఆయన పద్యాలేమో
అటక మీద!

ఆలోచనల ఊబిలో
కూరుకుపోయా
అక్షరం సాయంతో
బయటపడ్డా!

ఈ పిల్లాడి కళ్ళు
ఏమయ్యాయబ్బా?
చేతిలోని ఫోనుకి
అతుక్కున్నాయి

నిష్క్రియాపరత్వం
అనుమానపు రాత
నిష్కామకర్మ
నిజమైన గీత!

కవి కలానికి
రెండు వైపులా పదును
కవనమూ
కదనమూ



చంద్రుడి వద్ద
'వెన్నెల' మాయం
'సత్యం' తన కలంలో
ఒంపుకున్నాడుగా

కంటికి ఇంపు
అక్షరసిరి
వినసొంపు
తెలుగు వాక్ ఝరి!

పదకొండో వేలు
కన్నీరు తుడిచిందా
ఆత్మీయ నేస్తం
తోడున్నట్టే మరి!

నీతి నిజాయితీ
నీ దారి అయితే
నీ వేలు పట్టుకొనే
నీ వాళ్ళెందరో!

ఆటను అందలం
ఎక్కించాడు
రిట్టైరై కొత్తనీటికి
దారిచ్చాడు

చీకటిని చీల్చే
యత్నంలో స్ట్రీట్ లైట్
అలుపెరుగని
సూర్యుడిలా...!



అంతులేని
ప్రయాణం అర్కుడిది
సృష్టికే అది
తొలి జీవన పాఠం

రవి స్పర్శ తోనే
పత్ర హరితం
కవి తాకితేనే
అక్షరం అజరామరం!

పసివాడి చేతిలో
పలక చూశా
మనోఫలకంపై
మధుర జ్ఞాపకాలు

'ఏనుగు' వారి
'కొత్తపలక' చదివా!
మది పలకపై
నానీ మెరిసింది!!

రంగుల బట్టలు
రమ్యంగా నేస్తాడు
బతుకు మాత్రం
రంగు వెలసిన జెండా

అక్షరమై వెలిగినా
చిత్రమై నిలిచినా
ఎదను తాకే
మాట కావాలి!



అభివృద్ధి మంటల్లో
అంటార్కిటికా
అవని తల్లి
కన్నీటి పాలిక!

'నావి' 'నీవి' అంటూ
అడుగులేసిన 'నానీ'
అలరిస్తూ
మనందరిదయ్యింది!

జెండాలు వేరు
ఎజెండాలొకటే...
ప్రజల ఓట్లను
కొల్లగొట్టే పనిలో...!

గెలుపు
ఆకాశానికెత్తొచ్చునేమో
నేలమీద కాళ్లు
నిలిపేది ఓటమే

బకెట్‌తో
అవసరాలు తీర్చుకో
'తన్నావంటే'
నీకు నూకలు చెల్లినట్టే

అడవికి
రారాజువనుకోకు!
సర్కస్ రింగ్‌లో
కట్టు బానిసవేగా!!



కన్నయ్య చేతిలో
వేణువు
కలల గోపికల
ఆనంద హేతువు!

పరుల చేవ్రాలు
పక్కా ఫోర్జరీ!
ఇక బతుకంతా
సంతకం జైల్లోనే!!

నాగరికతలన్నీ
నగరాల చరిత్రే
మరి నా పల్లె
ఆనవాలేది!

ఒకే మాట ఒకే భార్య
రాముని బాట
ఒక్క మాట వినే
సీతనొద్దన్నాడే!

రోడ్డు మీద కత్తితో
శివాజీ
మలుపు తిరిగితే
కలంతో గోపీజీ

గోపీగారి కలం
చల్లింది కవితాపరాగం
నేడయ్యిందదే
నానీల వనం!!

సీతారామరాజు నెమ్మదస్తుడు, భావుకుడు. పుట్టిన దేశానికి దూరంగా ఉన్నా మన సాహిత్యాన్ని మరువనివాడు. విదేశంలో ఉన్నా కవిత్వ సంవేదనను పోగొట్టుకోలేదు, పైగా అది ద్విగుణీకృతం అయింది. రాజు కవిత్వంలో భావ సాంద్రత పుష్కలంగా వుంది.

డా. ఎన్.గోపి

కవి, కేంద్ర సాహిత్యఅకాడమీ అవార్డు గ్రహీత

సీతారామరాజు నానీల సంపుటి మృష్టాన్న భోజనాన్ని వడ్డించిన విస్తరి. వివిధ రుచులతో వండి వడ్డించిన పదార్థాలలా వివిధ వస్తువులతో కవిత్వీకరించి మనకు పంచిన నానీలు ఎన్నో ఉన్నాయి. అనుభూతి లోతుల్లోనుంచి రూపుదాల్చుకున్న నానీలు ఇవి. నానీల లక్షణాలను లక్షణంగా అనుసరించి రాసిన కవితా సంపుటి. అంత్యప్రాసలతో పరవళ్ళుదొక్కిన నానీలు. వెరసి నీ, నా భావాలను తట్టిలేపి ఆలోచింపజేసి అనుభూతి చెందించే నానీలు ఇవి.

డా. తలతోటి పృథ్విరాజ్

కవి, విమర్శకుడు

తెలంగాణలో పుట్టి దక్షిణాఫ్రికాలో ఉద్యోగరీత్యా నివాసముంటున్న రాపోలు సీతారామరాజుకు సాహిత్య అధ్యయనం నిత్యకృత్యం. ఈనాటి యువకుల్లో కనిపించని భాషా మమకారం, సాహిత్యాభిరుచి ఇతనిలో మెండుగా కనిపిస్తాయి. మంచి సాహిత్యం సృష్టించే వారితో సాన్నిహిత్యాన్ని పెంచుకుంటూ కవిత్వానికి తనకూ ఉన్న భేధాన్ని పరిపుష్టం చేసుకుంటున్న సీతారామరాజులో మంచి కవి ఉన్నాడని ఈ నానీలను చూస్తే అర్థమవుతుంది.

వెన్నెల సత్యం

కవి



రాపోలు సీతారామరాజు